అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ఫతేపూర్ గ్రామంలో పర్యటన



ఫతేపూర్‌లో అంగన్‌వాడీ చిన్నారితో పాట పాడిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఫతేపూర్‌లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. యాప్ ఎలా పని చేస్తుంది.. ప్రజలు సహకరిస్తున్నారా.. అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో అదే గ్రామానికి చెందిన పిట్టల రాములమ్మ అనే మహిళను ఎమ్మెల్యే పలుకరించారు. పదేళ్లలో ఎవరైన అధికారులు మీ ఇంటికి వచ్చారా.. మీ సమస్యలు అడిగి తెలుసుకున్నారా అని అడగగా.. ఇంతవరకు ఎవరూ రాలేదని ఆమె సమాధానమిచ్చింది. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు గూడు కల్పించాలన్న ఆలోచనతో ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకొచ్చిందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు అర్హులను గుర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ఎంపీడీఓ కరుణశ్రీ, నాయకులు పండరినాథ్, భాస్కర్, నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

సమాజంలో అంగవాడీలదే కీలకపాత్ర

మహబూబ్‌నగర్ రూరల్: చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ వారికి క్రమశిక్షణ, విద్యాబుద్ధులను నేర్పడంలో అంగన్‌వాడీలదే కీలకపాత్ర అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఫతేపూర్ క్లస్టర్–3లో అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంలను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులను పలుకరిస్తూ వారి పేర్లను తెలుసుకున్నారు. చిన్నారులు పాడిన పాటలను ఎమ్మెల్యే ఆసక్తిగా విన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుందర్‌రాజ్, సీడీపీఓ శైలాశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీఈడీ కళాశాలలో మౌలికవసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఈ కళాశాల ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ఏ ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనైనా సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకుని రావాలన్నారు.

మహిళల సంక్షేమమే ధ్యేయం

స్టేషన్ మహబూబ్‌నగర్: మహిళల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మహబూబ్‌నగర్, హన్వాడ మండలాలకు చెందిన 110 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు కూడా మహిళల పేరున నియోజకవర్గానికి సుమారు 17వేల ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని అన్నారు.

విగ్రహం ఏర్పాటుకు కృషిచేస్తా

జిల్లా కేంద్రంలోని అమరువీరుల స్థూపం పక్కన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, బాలకిషన్, హనీఫ్, శంకర్, రాములు యాదవ్, రాజనర్సింహుడు పాల్గొన్నారు.

అవినీతికి తావులేకుండా చేసేందుకు కృషి

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవాబుపేటలో కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అవినీతికి తావు లేకుండా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులదందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని తెలిపారు. వచ్చే ఏడాది మండలానికి మరిన్ని ప్రత్యేక నిధులు వచ్చేలా ప్రణాళికలు వేశామన్నారు. ఇప్పటికే కొల్లూర్‌కు ప్రత్యేకంగా 90కోట్లతో ప్రత్యేక విద్యుత్ స్టేషన్, మండల కేంద్రానికి ప్రత్యేకంగా మినీస్టేడియం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే వందల కోట్ల రూపాయలు నిధులు రోడ్ల కోసం కేటాయించామన్నారు. నవాబుపేట, యన్మన్‌గండ్ల జంట గ్రామాల పెద్దచెరువు, లోకిరేవు పెద్దచెరువును మినీ ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ లింగం, కాంగ్రెస్ నాయకులు బంగ్లరవి, వాసు, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, రాజేష్, ఖాజా, అంజన్‌కుమార్, నర్సింహ, సత్యం, రమేష్, శ్రీనివాస్, రాజశేఖర్, నీలకంఠ, అమరేష్, సంతో ష్, వెంకటయ్య, హమీద్, శ్రీహరి న్నారు.

పాలమూరు సహకార బ్యాంకు ప్రారంభం

జడ్చర్ల: స్థానిక గంజ్‌లో పాలమూరు సహకార బ్యాంకును శుక్రవారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పాలమూరు కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకు 3వ బ్రాంచ్‌ని జడ్చర్లలో ఏర్పాటుచేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ కుమారస్వామి, వైస్ చైర్మన్ కృష్ణయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, వైస్ చైర్‌పర్సన్ సారిక, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ జ్యోతి, డైరెక్టర్లు రామ్మోహన్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గండేడ్: దొంగ హామీలు ఇవ్వడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పంచాంగల్‌తండాలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్ రాంరెడ్డితో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో రావడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో అడ్డదారులు తొక్కిందన్నారు. డొక్కు బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప పేదలకు ఎలాంటి మేలు చేయలేదని అన్నారు. సర్పంచ్‌లు దిగి ఏడాది గడుస్తున్నా బిల్లులు ఇవ్వకపోవడం ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మహమ్మదాబాద్ మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు బిక్షపతి, కుల్కచర్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, కొండారెడ్డి, సాయికుమార్, జోగుకృష్ణ, రాజునాయక్ పాల్గొన్నారు.

వెంకట్‌రాములు మృతి తీరని లోటు



వెంకట్‌రాములు మృతదేహానికి నివాళులర్పిస్తున్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

గండేడ్: బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు వెంకట్‌రాములు మృతి పార్టీకి తీరని లోటు అని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెన్నాచేడ్ గ్రామానికి చెందిన వెంకట్ రాములు గురువారం మృతి చెందాడు. దీంతో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ డైరెక్టర్ రాంరెడ్డి తదితరులు ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం



మున్సిపల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న మేదర సంఘం నాయకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పద్మావతి కాలనీలో కేతేశ్వర స్వామి విగ్రహ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించిన మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను శుక్రవారం మేదర సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కె.రాములు, మేదర సంఘం జిల్లా అధ్యక్షుడు రాములు, నాయకులు సత్యం, రాజేందర్, శివరాజ్, జ్యోతి, కె.లక్ష్మణ్, వెంకటేష్, సుధాకర్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌ను మంజూరు చేయాలి

చిన్నచింతకుంట: మండల కేంద్రానికి 108 అంబులెన్స్‌ను మంజూరు చేయాలని బీజేపీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి నంబి రాజు, నాయకుడు కుర్వ రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతకాలంగా 108 అంబులెన్స్ లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. రాత్రి సమయాల్లో ఏ వాహనాలు అందుబాటులో లేక ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు దాపురిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి మండల కేంద్రానికి వెంటనే 108 అంబులెన్స్‌ను ఏర్పాటుచేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కటేశ్వర్‌రెడ్డి, రాము, నరేందర్‌జీ, కురుమూర్తి పాల్గొన్నారు.

గోవర్ధన్‌రెడ్డి సేవలు చిరస్మణీయం

కోయిల్‌కొండ: జవాన్ గోవర్ధన్‌రెడ్డి సేవలు చిరస్మణీయమని ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గోవర్ధన్‌రెడ్డి 10వ వర్ధంతి సందర్భంగా మండలంలోని సంగనోనిపల్లిలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచులు కృష్ణయ్య, అనితభీంరెడ్డి, నాయకులు మల్లయ్యాయదవ్, జవాన్ గోవర్ధన్‌రెడ్డి తల్లిదండ్రులు లలిత, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆంజనేయ స్వామి ఉత్సవాలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం నుంచి వార్షిక ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు దేవస్థాన కమిటీ వారు తెలిపారు. శనివారం ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, అఖండ దీపారాధన, అఖండ భజనలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం ఉంటుందని దేవస్థాన కమిటీ వారు తెలిపారు.

వాసవీమాతకు పూజలు

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. పలువురు దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం దేవాలయంలో సామూహిక కుంకుమార్చన, పల్లకీసేవ నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన ఆదిఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమత్ త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘేందర్‌రావు తెలిపారు. స్వామివారికి వాయుస్తుతితో ఫల పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామావళి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

రద్దీగా.. ఓపీ కౌంటర్

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోజు రోజుకు రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ఓపీ కౌంటర్ల వద్ద రద్దీ ఏర్పడుతోంది. దీంతో సామాన్య రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్యుడిని కలిసేముందు ప్రతి అవుట్ పేషంట్ ముందుగా ఆధార్ సహాయంతో ఓపీ తీసుకోవాలి. జనరల్ ఆస్పత్రిలో ఒక్కటే ఓపీ కౌంటర్ ఉండటంతో ఓపీ కోసం భారీ సంఖ్యలో రోగులు క్యూ కడుతున్నారు. సోమవారం నుంచి గురువారం వరకు రద్దీ అధికంగా ఉంటుంది. చికిత్స అనంతరం ట్యాబ్‌లెట్స్ తీసుకునే కౌంటర్ సైతం ఒక్కటే ఉండటంతో అక్కడ కూడా నిత్యం రోగులు క్యూలైన్‌లో నిలుస్తున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రిలో ఓపీ కౌంటర్‌తో పాటు ట్యాబ్‌లెట్స్ కౌంటర్లు ఎక్కువగా ఏర్పాటు చేయాలని రోగులు కోరుతున్నారు.



ట్యాబ్‌లెట్ కౌంటర్ దగ్గర రోగుల రద్దీ

క్లుప్తంగా

పశువైద్య శిబిరం విజయవంతం

మిడ్జిల్: మండలంలోని మసిగొండ్లపల్లిలో శుక్రవారం నిర్వహించిన పశువైద్య శిబిరం విజయవంతమైనట్లు పశువైద్యాధికారి శివ రాజ్ తెలిపారు. 96పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ చర్యలు చేపట్టామన్నారు. గ్రామంలో రోజు విజయ డెయిరీలో 1300 లీటర్ల పాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. పాడి అభివృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి మధుసూదన్ వివరించారు. కార్యక్రమంలో విజయ డెయిరీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, డాక్టర్స్ జగదీశ్వర్, రాంప్రసాద్, ఆశారాణి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పూజ

గండేడ్: మండలంలోని పంచాంగల్‌తండాలో అయప్ప పటం పూజ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పెంట్యానాయక్ ఇంట్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాజు గురుస్వామి ఆధ్వర్యంలో పూజారి వినోద్ సమక్షంలో గణపతి, కుమారస్వామి, అయ్యప్పస్వాముల అంగపూజ, అష్టోత్తర శతనామావళి పూజలను చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. అయ్యప్ప మాలధారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇద్దరు ఉపాధ్యాయులకు మెమోలు జారీ

దేవరకద్ర: స్థానిక ప్రాథమిక పాఠశాలలోపని చేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులకు ఎంఈఓ బలరాం మెమోలు జారీ చేశారు. శుక్రవారం పాఠశాల తనిఖీకి ఎంఈఓ వచ్చారు. పాఠశాలలో నలుగురు ఉపాధ్యాయులు ఉండగా అందులో ఒకరు కస్తూర్బాకు, మరొకరు సర్వేకు వెళ్లారు. ఇద్దరు ఉపాధ్యాయులు విధులకు ఆలస్యంగా రావడంతో మెమోలు జారీచేశారు.

టీఎస్‌యూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

గండేడ్: మండల కేంద్రంలో జరిగిన మహాసభలో టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గంటా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బోరు కృష్ణయ్య, ఉపాధ్యక్షుడిగా సుజాత, శ్రీనివాస్, కోశాధికారిగా జనార్దన్, కార్యదర్శులుగా గోవిందు, సేవ్యానాయక్, శ్రీవాణి, సత్యయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా వెంకటయ్య ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధానకార్యదర్శి రవి కుమార్, మహమ్మదాబాద్ మండలాధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షులు సాయన్న, లాలు, గోపాల్ హాజరయ్యారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: హాస్టల్స్‌లో ఉండే బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డాక్టర్ నితేషా పేర్కొన్నారు. ఈమేరకు పాలమూరు యూనివర్సిటీలోని కృష్ణవేణి బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. బాలికలు హార్మోన్ల అసమతౌల్యం వల్ల రుతుక్రమంలో ఇబ్బందులు వస్తాయని అన్నారు. వాటిని అధిగమించాలంటే క్రమం తప్పకుండా వ్యాయామం, వాకింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ సంధ్యారాణి, వార్డెన్లు మాధురిమోహన్, కల్పన, స్వాతి, రమాదేవి, రేణుక, శివరాణి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

రంగనాయకస్వామి చెంతకు యాత్రికులు

- ఆలయంలో పూజలు

జడ్చర్ల టౌన్: బాదేపల్లి పెద్దగుట్టపై వెలసిన రంగనాయక స్వామి చెంతకు శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన యాత్రికులు వచ్చారు. హైదరాబాద్ నుంచి కర్నూలు వెళ్తూ మార్గమధ్యలో పెద్దగుట్టను సందర్శించారు. ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి చెంతకు వచ్చిన యాత్రికులకు ఆలయ పరిరక్షణ కమిటీ కన్వీనర్ కాల్వ రాంరెడ్డి స్వాగతం పలికి గుట్ట, ఆలయ విశేషాలను వివరించారు.

నేడు గాయత్రి యజ్ఞం

పెద్దగుట్టపై రంగనాయక స్వామి ఆలయంలో శనివారం ఆర్యసమాజ సభ్యులతో లక్ష్మీసూక్త సహిత గాయత్రి యజ్ఞం నిర్వహించనున్నారు. భక్తులు అధికసంఖ్యలో హాజరు కావాలని ఆలయ పరిరక్షణ కమిటీ పిలుపునిచ్చింది.

అదుపు తప్పి కారు బోల్తా

- ఇద్దరికి గాయాలు

మహమ్మదాబాద్: అదుపు తప్పి కారు బోల్తా పడిన సంఘటన మండలంలోని మొకర్లాబాద్ సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. మన్యంకొండ సమీపంలో గల రాంచంద్రాపురంతండాకు చెందిన రాముురాథోడ్ ముంబైలో నివాసం ఉంటున్నాడు. పెళ్లి నిమిత్తం స్వగ్రామానికి కారులో వస్తున్నాడు. శుక్రవారం ఉదయం మండలంలోని మొకర్లాబాద్ వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో రాము రాథోడ్, ఆయన భార్య సిమ్‌లోరాథోడ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రలను 108 లో మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు అక్కడ చికిత్స పొందుతున్నారు.

ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చిన్నరాజమూర్‌లో ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు



ఉత్సవాలకు ముస్తాబైన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయం

- 15న రథోత్సవం

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం ధ్వజారోహణ చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ, హనుమద్ వ్రతం, పవమాన హోమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లను చేశారు.

బ్రహ్మోత్సవాల్లో రోజువారీ పూజలు

⇨ 14వ తేదీ శనివారం పంచామృతాభిషేకం అలంకరణ, రాత్రికి అశ్వవాహన సేవ, ప్రభోత్సవం.

⇨ 15వ తేదీ ఆదివారం ఉదయం పంచామృతాభిషేకం మహాఅలంకరణ, రాత్రికి గజవాహనసేవ, రథోత్సవం.

⇨ 16వ తేదీ సోమవారం ఉదయం అవభృత స్నానం, పంచామృతాభిషేకం, రాత్రికి పల్లకీసేవ

⇨ 17వ తేదీ మంగళవారం స్వామివారికి పంచామృతాభిషేకం అలంకరణ, రాత్రికి పల్లకీసేవ ఉంటుంది. రెండు వారాల పాటు జాతర ఉత్సవాలు కొనసాగుతాయి.

ప్రత్యేక బస్సులు..

దేవరకద్ర నుంచి 12 కిలోమీటర్ల దూరంలో కోయిల్‌సాగర్ వెళ్లే రోడ్డులో చిన్నరాజమూర్ దేవాలయం ఉంది. ఆర్టీసీ వారు దేవరకద్ర నుంచి చిన్నరాజమూర్‌కు ఆదివారం ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు.

క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానాలు



విద్యార్థులకు దుస్తులు అందజేసిన క్రైస్తవులు

స్టేషన్ మహబూబ్‌నగర్: క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానాలు బోర్డు ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ రెవరెండ్ ఎంఆర్ సుందర్‌పాల్ అని అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబీసీ జూనియర్ కళాశాలలో ఎంబీ కాన్ఫరెన్స్ బోర్డు ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, ఎంబీడీఓ ఆధ్వర్యంలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. జీసీ సెక్రటరీ రెవరెండ్ జీకే రూపస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఆర్ సుందర్‌పాల్ పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. డాక్టర్ ఎ.రూపస్, ఎబినెజర్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎస్ఏస్.డేవిడ్, కోశాధికారి ఎ.టైటస్ రాజేందర్, ఎంబీడీఓ సెక్రటరీ ఎస్.శేఖర్, బోర్డు ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ మారడోనా మోజస్, కె.షద్రక్, పాస్టర్ ఆదాం, యెబినెజర్, అలెగ్జాండర్, దాసరి సుందర్, జోసఫ్, దాసరి ప్రభాకర్, సురేష్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శబరిమలైకి సైకిల్‌పై గాని సుధీర్‌రెడ్డి



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రానికి చెందిన అయ్యప్ప మాలధారుడు గాని సుధీర్‌రెడ్డి సైకిల్‌పై శబరిమలైలోని స్వామివారి దర్శనం కోసం బయలుదేరారు. జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమైన ఆయన సైకిల్‌యాత్ర కర్నాటకలోని బెంగుళూర్ మీదుగా దాదాపు 17 రోజులపాటు శబరిమలైకు చేరుకోనుంది. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలో శుక్రవారం గాని సుధీర్‌రెడ్డిని మఠం మయూర్‌నాథ్ తదితరులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అయ్యప్ప మాలధారులు అరవింద్‌గౌడ్, రాచాల శ్రీధర్, మనోజ్, జెట్టం మహేష్, గిరి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి

అడ్డాకుల: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కురుమూర్తి సూచించారు. మండలంలోని తిమ్మాయిపల్లితండా పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు బాలకిష్టయ్య, అంజద్ అలీ, బాలరాజును శుక్రవారం ఎంఈఓ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని అన్నారు. ఇందులో గురువుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలరాజు, ఉపాధ్యాయులు రాములు, లక్ష్మణ్‌గౌడ్, మలేకబేగం, లక్ష్మీదేవి, సత్యనారాయణ, అన్వర్ హుస్సేన్, అరుణకుమారి, నర్మద, గాయత్రి పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో దీపోత్సవం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు దీపోత్సవం నిర్వహించారు. కార్తీకమాసం ముగిసినప్పటికి ప్రతి మంగళ, శుక్రవారాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఒక్కో వారం ఒక్కో దేవత, దేవుడి రూపంలో పూలతో తీర్చిదిద్ది దీపాలు వెలిగిస్తున్నారు. శుక్రవారం వేంకటేశ్వర స్వామి ఆకారంలో పూలతో అలంకరించి దీపాలు వెలిగించారు. స్వామి ఆకారంతోపాటు అమ్మవారి రూపాన్ని సైతం తీర్చిదిద్దారు.

ఫ్లైఓవర్‌పై బ్రిడ్జి వద్ద మరమ్మతు

జడ్చర్ల టౌన్: జాతీయరహదారిపై ఉన్న ఫ్లెఓవర్‌పై బ్రిడ్జి వద్ద శనివారం మరమ్మతులు చేపట్టారు. కొంతకాలంగా బ్రిడ్జి వద్ద భారీ వాహనాలు వెళ్లిన సమయంలో శబ్దాలు వచ్చేవి. దీంతో స్పందించిన నేషనల్ హైవే శాఖ ఇంజినీరింగ్ విభాగం అధికారులు మూడు రోజుల క్రితం పరిశీలించారు. ఫ్లైఓవర్ జాయింట్ మధ్యలో ఉండే అంగ్లేర్ విరిగిపోవటంతో శబ్దాలు వస్తున్నాయని గుర్తించారు. దానికి శుక్రవారం మరమ్మతులు ప్రారంభించారు. ఇందుకుగానూ ఫ్లెఓవర్ పైన మూడులైన్లు ఉండగా రెండులైన్లలో మాత్రమే వాహనాలకు అనుమతి ఇచ్చారు. ఈ మేరకు హైవేపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. బ్రిడ్జ్ వద్ద వస్తున్న శబ్దాలను గుర్తించి మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

పకడ్బందీగా సర్వే

నవాబుపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా కొనసాగుతోందని హౌసింగ్ డిప్యూటీ ఈఈ నర్సింహులు తెలిపారు. శుక్రవారం మండలంలోని కాకర్ల పహాడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు యాప్ పనితీరును పరిశీలిస్తూ పంచాయతీ అధికారులు సర్వేపై రోజువారీ సమాచారమివ్వాలని ఆయన సూచించారు. అధికారులు ఒత్తిడికి గురి కాకుండా కేవలం 500 లోపే సర్వే చేయాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జయరాంనాయక్ తదితరులు ఉన్నారు.

ఖాజాఖాన్‌కి ఘన సన్మానం



మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ ఒలింపిక్ సంఘం జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన ఖాజాఖాన్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. జిల్లా వ్యక్తికి రాష్ట్రస్థాయి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు విక్రం ఆదిత్య, ఉపాధ్యక్షులు సాదత్‌ఖాన్, సయ్యద్ అంజద్‌అలీ, మహ్మద్ హబీబ్‌ఖాన్, అక్రం హాష్మి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరుకోవాలి



రాజాపూర్: విద్యార్థులు బాగా చదివి తాము ఎంచుకున్న లక్ష్యానికి చేరుకోవాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తల్లి, రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు షూలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వచ్చే సంవత్సరం షూలతో పాటు స్కూల్‌బ్యాగ్, వాటర్ బాటిళ్లు ఇస్తారన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కృషిచేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రావ్, నాయకులు నరహరి, కృష్ణయ్య, విక్రంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నసీర్‌బేగ్, ఉపాధ్యాయులు ఎల్లయ్య, మోజస్, రాధ, దివాకర్, వెంకటేశం, సంజీవ్‌రెడ్డి, సరోజ పాల్గొన్నారు.

అరుణ్‌సూర్యకి అవార్డు రావడంపై హర్షం

కోయిల్‌కొండ: మండల కేంద్రానికి చెందిన అరుణ్‌సూర్యకి టీటీడీ మహతి ఆడిటోరియం విభాగంలో జ్యోతిష్య శిరోమణి అవార్డు రావడంపై శుక్రవారం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ మహతి ఆడిటోరియం విభాగంలో 26వ తరం వంశీయులు శ్రీరంగాచారి, ఎన్ఏస్లైవ్ ఆస్ట్రాలజి వ్యవస్థాపకులు డాక్టర్ నరసింహ స్వామివారి ఆధ్వర్యంలో జ్యోతిష్య పురస్కార అవార్డు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా న్యూమరాలజీ రంగంలో సేవలందిస్తున్న అరుణ్‌సూర్యకు జ్యోతిష్య శిరోమణి అవార్డు దక్కింది.